# ముగింపు కథ

రచన:
శ్రీ రేగులపాటి కిషన్‌రావు

సూర్యుడు ఆకాశంలో సాగిపోతున్నాడు. గాలి మెల్లిగా వీస్తున్నది. చెట్లు ఆనందంగా తల ఊపుతున్నాయి. పక్షులు చెట్లపై ఎగురుతూ సంతోషంతో అరుస్తున్నాయి.

కరంటుమోటారు నడుస్తున్నది. బావిలోని నీరు తరిగి పోతున్నది. ఆ బావికి తూర్పువైపున వున్న వంకాయ చెట్లకు నీరు పారిస్తున్నాడు యాదగిరి. బావికి పడమటి వైపున వున్న టమాట చెట్లకు నీరు పారిస్తున్నాడు విశ్వనాథం.

విశ్వనాథం ఆ చెట్లకు యజమాని. అంతేకాదు - పది ఎకరాల నేలకు యజమాని. యాదగిరి పేరుకు పాలేరు. కాని విశ్వనాథానికి పనిలో కుడిభుజం లాంటివాడు. అందంగా దృఢంగా వున్న యాదగిరి పాలేరంటే నమ్మ శక్యం కాదు. యాదగిరి విశ్వనాథం బంధు వర్గంలోని వాడేమో అనుకుంటారు కొత్తవాళ్ళు.

యాదగిరి విశ్వనాథాన్ని 'దొరా' అంటాడు. విశ్వనాథం యాదగిరిని 'గిరీ' అంటాడు.

యాదగిరి దృష్టి ఎప్పుడూ పని మీదనే ఉంటుంది. కారణం ఏదైనప్పటికీ విశ్వనాథంకు యాదగిరి మీద మంచి అభిప్రాయం ఉంది.

"నాన్నా!" అన్న పిలుపు వినిపించింది. విశ్వనాథం మామిడి చెట్లవైపు చూశాడు. దాని క్రింద ఒక అమ్మాయి నిలబడి వుంది. ఆమె నెత్తిమీద గంప ఉంది. ఆ గంపలో సద్ది ఉంది. ఆ అమ్మాయి పేరు శారద. విశ్వనాథం ఏకైక పుత్రికా రత్నం.

పని ఎక్కువగా ఉన్న రోజున ఉదయమే సద్ది తెమ్మని బిడ్డకు చెప్పి పనికి వస్తాడు రామనాథం. యాదగిరికి కూడా పని బాగా ఉన్న రోజున వాళ్ళే అన్నం పెడుతారు:

"గిరీ! నీళ్ళు పొలానికి కట్టు" అన్నాడు విశ్వనాథం.

యాదగిరి ఇటు వంకాయ చెట్లవైపు, అటు టమాట చెట్లవైపు ప్రవహిస్తున్న నీటిని పొలం వైపు ప్రవహింపచేలా చేశాడు.

విశ్వనాథం వాటర్‌టాంకులో కూర్చుండి స్నానం చేసి తడిబట్టలు వదిలేసి పొడిబట్టలు కట్టుకుంటూ అన్నాడు - "గిరీ! తొందరగా స్నానం చేసిరా తిందాం."

యాదగిరి పది నిమిషాల్లో స్నానం చేసి మామిడిచెట్టు క్రిందికి వచ్చాడు.

శారద విస్తర్లు వేసి గుత్తివంకాయ కూర, టమాట పప్పు అన్నం వడ్డించింది.

"గిరీ! కడుపు నిండా తినురా. గుత్తివంకాయ కూర బాగుందిరా!" అన్నాడు విశ్వనాథం.

యాదగిరి నవ్వుతూ అన్నాడు - "టమాట పప్పు మరీ బాగుందండీ!"

యాదగిరి అన్నం తినడంలో వేగం వుంది. స్నానం చేయడంలో వేగం వుంది. పని చేయడంలో వేగం వుంది. పాఠశాలలో పెద్దగా చదవకపోయినా కథల పుస్తకాలు పట్టుకుంటే వేగంగానే చదివేస్తాడు. విషయాన్ని వేగంగానే అర్థం చేసుకుంటాడు. పదవ యేటనే తల్లిదండ్రులను పోగొట్టుకొని ముసలినాయనమ్మ అనురాగాన్ని అనుభవించి పెరిగి పెద్దవాడయ్యాడు.

శారద తండ్రికీ యాదగిరికీ గడ్డపెరుగు వడ్డించింది.

"అమ్మాయిగారూ! మీరు అన్నం వడ్డిస్తే రెండు పొట్టలు కావాలండీ!" అన్నాడు యాదగిరి.

"వడ్డిస్తే కాదురా రెండు పొట్టలు కావలసింది-అమ్మాయి చేసిన వంట తినడానికి రెండు పొట్టలు కావాలి. దీని తల్లి కూడా ఎంతో రుచిగా చేసేదిరా వంట."

విశ్వనాథం భార్య క్యాన్సర్ వ్యాధితో చనిపోయింది. ఆమె చనిపోయే ముందు వాళ్ళ పుట్టింటినుండి తెచ్చిన నిమ్మ మొలకలు ఈ తోటలో పెరిగి పెద్దవై కాయలు కాస్తున్నాయి. ఆమెను పదే పదే జ్ఞప్తికి తెస్తున్నాయి.

ఇద్దరూ భోజనం ముగించారు.

"విస్తరి నేను తీసేస్తాను. మీరు కడుక్కోండి దొరా!" అన్నాడు యాదగిరి తన విస్తరి మలిచి పట్టుకొని.

విశ్వనాథం అన్నపుచెట్టు మొదట్లో చేయి కడుక్కున్నాడు.

యాదగిరి రెండు విస్తర్లు తీసేసి చేయి కడుక్కొని శారదవైపు చూస్తూ "అమ్మాయిగారూ! పూలు తీసుక రమ్మంటారా!" అన్నాడు.

"రేపు కృష్ణాలయంలో పూజ వుందిరా. బాగా తెంపుక రా!" అంది.

యాదగిరి పూల చెట్లవైపు వెళ్ళిపోయాడు.

విశ్వనాథం వేపచెట్టు క్రిందికి వెళ్ళి గొంగడి పరుచుకొని పడుకున్నాడు.

"చిన్నా! కథ చదివి వినిపించమ్మా!" అన్నాడు. శారదను చిన్నవాటినుండి ముద్దుగా 'చిన్నా' అని పిలవడం ఆయనకు అలవాటు అయిపోయింది.

"ఏ కథ చదువుమంటారు నాన్నా?"

"రుక్మిణీ కళ్యాణం."

శారద పుస్తకం తెరచి చదవసాగింది.

యాదగిరి తట్టలో పూలు పట్టుకొని గబగబా పరుగెత్తి వచ్చాడు, శారద యాదగిరిని చూచి "ఇన్ని పూలు ఎప్పుడు తెంపావురా?" అంది.

"కృష్ణాలయంలో పూజ చేసే విషయం మీరు నిన్ననే చెప్పారుగా. అది జ్ఞాపకం ఉంది. ఈ రోజు ప్రొద్దున రాగానే పూలు తెంపి చిక్కుడుచెట్ల చాటుకు దాచాను."

యాదగిరి పూలతట్టను అక్కడ పెట్టి పంచె పరచుకొని కూర్చున్నాడు.

శారద పద్యాలు చదువుతూ అర్థం వివరించ సాగింది. అరగంట అయిందో లేదో విశ్వనాథం నిద్రలోకి వెళ్ళిపోయాడు.

శారద చదవడం ఆపి తండ్రివైపు చూచింది.

"చదవండి అమ్మాయిగారూ!"

"నాన్న పడుకున్నారు."

"మీరు కథ చదివితే వింటూ పడుకోవడం దొరగారికి అలవాటే కదా! మధురమైన మీ కంఠస్వరం వింటూ హాయిగా నిద్ర పోయారు దొర. మీరు చదవడం ఆపితే మళ్ళీ లేస్తారు. దొరగారు చాలా అలసిపోయారు. చదవండి అమ్మాయిగారూ!"

"కథలు వినమంటే నీకు అంత యిష్టమా?" అంది శారద.

"వినడమే కాదు. చదవడం కూడా యిష్టమే. కాని ఈ పద్యాలు నాకు స్పష్టంగా అర్థం కావు. చందమామ కథలైతే గబగబా చదివేస్తాను."

శారద చదవడం మొదలు పెట్టింది ఆమె చదువుతూనే వుంది. యాదగిరి వింటూనే ఉన్నాడు.

సూర్యుడు పడమటివైపు వెళ్ళిపోతున్నాడు.


ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్



# జెట్ పంపులు

రెండు స్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనోబ్లాకు, జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.
½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.



LOW MAINTENANCE
HIGH CAPACITY
SIMPLE TO INSTALL

వివరములకు

Grams : "NAIDUBROS" Phone : Office : 24997 Works : 22757

THE EL-P-EM INDUSTRIALS

339, Mettupalaym Road, (P. B. No. 1053) COIMBATORE-641 002

SALES BRANCHES :–

112, Zeera, Secunderabad - 3.
13/85, Jayachamarajendra Road, Bangalore - 2.
10, Municipal Market Building, Kokkalai, Trichur-1.

విశ్వనాథం లేచి కూర్చున్నాడు. యాదగిరి లేచి నిల్చున్నాడు. శారద పుస్తకం మూసేసింది. యాదగిరి పార పట్టుకొని పొలంలోకి వెళ్ళిపోయాడు. విశ్వనాథం కరెంటు మోటారు పెట్టి చిక్కుడు చెట్లకు నీళ్ళు కట్టసాగాడు. శారద తట్టలోని పూలు గంపలో పోసుకొని యింటివైపు బయలుదేరింది.

* * *

యాదగిరి యింటికి చేరుకొనేసరికి ఇంట్లో కిరసనాయిల్ దీపం వెలుగుతూ ఉంది.

"నాయనమ్మా! ఇలా రా, నీ కోసం ఏం తెచ్చానో చెప్పు?" అన్నాడతడు.

"ఏం తెచ్చావో నాకెలా తెలుస్తుంది నాయనా?"

"ఊహించు నాయనమ్మా!"

"నేను ఊహిస్తూ ఉంటాను. ఇంతలో నువ్వు అన్నం తిందువు గానిరా!"

"నేను తెచ్చిన పండ్లు నువ్వు తింటే, నువ్వు చేసిన వంట నేను తింటాను."

"సరే, అలా అయితే నువ్వు తెచ్చిన పండ్లు ఇలా యివ్వు తింటాను."

"నేను తెచ్చిన పండ్ల పేరు నువ్వు చెప్పనే లేదు నాయనమ్మా!"

"చెప్తారా....జామపండ్లు,"

"ఎలా ఊహించావే నాయనమ్మా!"

"ఇది జామపండ్ల సీజన్‌రా. పైగా నేను యిష్టపడే పండ్లే నా కోసం తెస్తావని నాకు తెలియదా?"

యాదగిరి జామపండ్లు బయటకు తీసి వాళ్ళ నాయనమ్మ చేతిలో పెట్టాడు. ఆమె ఆ పండ్లు పట్టుకొని వంటింట్లోకి వెళ్ళి పళ్ళెం కడిగి మనుమనికి అన్నం పెట్టి తినమంది.

యాదగిరి అన్నం తింటుండగా ముసలమ్మ ఓ జామ పండు తినేసింది. ముసలమ్మ మళ్ళీ అన్నం వడ్డించబోగా "నాకు చాల్లే నాయనమ్మా! ఇక నువ్వు అన్నం తినే సెయ్యి" అన్నాడు.

"శారదమ్మాయిగారు చేసిన వంట తిన్నరోజున నీకు నేను చేసిన వంట రుచించదని తెలుసు. అందుకే నా కోరిక నెరవేరాలని దేవునికి పూజలు చేస్తున్నాను."

"ఏమిటే నాయనమ్మా! ఓ మాటకు ఓ మాట అతుకకుండా మాట్లాడుతున్నావు. శారదమ్మాయిగారి వంటేమిటి? నీ కోరిక నెరవేరడానికి దేవుని మాటేమిటి?"

"శారదమ్మాయిలాగా వంటచేసే చక్కని చుక్కలాంటి అమ్మాయి నా మనుమనికి దొరకాలని పూజ చేస్తున్నానురా!"

"నీ పూజ ఫలిస్తుందా నాయనమ్మా?"

"నా భక్తిలో బలముంటే తప్పకుండా ఫలిస్తుందిరా!"

"నేను ఓ గంట తర్వాత వస్తాను. నువ్వు తిని పడుకోవే నాయనమ్మా!" అని చెప్పి యాదగిరి వీధిలోకి వెళ్ళిపోయాడు.

* * *

యాదగిరి కుండలోవున్న ఉలువపప్పు తట్టలో వేస్తున్నాడు.

శారద స్టూలుమీద నిలబడి విద్యుత్ బల్బును తుడవబోయింది. అది అందలేదు. ఆమె మడిమలను పైకెత్తి బల్బు తుడువసాగింది. స్టూలు బెణికింది. ఆమె కెవ్వున కేక వేసి క్రింద పడబోయింది. యాదగిరి పరుగెత్తి వచ్చి ఆమెను పడకుండా పట్టుకున్నాడు. స్టూలు అటువైపు పడిపోయింది. యాదగిరి చేతులకున్న ఉలువపప్పు శారద నడుముకు అంటుకుంది.

మీ సంతృప్తికి....

మేము తయారిస్తున్న ప్రత్యేకమైన రకాలు!!

* మ్యాజిక్ ఫైన్ * జెనీవా ఫైన్
* పాయల్ ఫైన్ * కూల్ టెక్స్ ఫైన్
* పోలె ఫైన్ * పైలెట్ ఫైన్

Regd. No.
A. 29259/80

తయారించువారు:

Phone: 22891

GENEVA KNITTERS, StunsRoad 1st Street, TIRUPUR - 638 602.

యాదగిరి శారదను వదిలేశాడో, శారద యాదగిరి చేతులను వదిలించుకుందో తెలియలేదు.

"నువ్వు పట్టుకోకుంటే పడిపోయేదాన్నిరా!" అంది శారద - నడుముకు అంటిన ఉలవపప్పు తుడుచుకుంటూ.

"అజాగ్రత్త పనికిరాదు అమ్మాయిగారూ! పడిపోతే ఎంత దెబ్బ తగిలేదో ఆలోచించండి!" అంటూ యాదగిరి ఉలవ పప్పున్న తట్టలను పట్టుకొని గేదెల కొట్టములోకి వెళ్ళిపోయాడు.

"గిరీ! ఒకసారి యిలా వస్తావా?" శారద పిలుపు విని యాదగిరి ఆమె దగ్గరకు వచ్చాడు.

"చేతులు కడుక్కొని రా, కొంచెం ఉప్మా తిందువు గాని!"

యాదగిరి చేతులు కడుక్కొని వచ్చాడు. అతడన్నాడు. "చందమామ పత్రికలో నిన్న ఓ కథ చదివానండి. ఆ కథలో రాజకుమార్తె కూడా తోటమాలికి లడ్డూలు, జిలేబీలు ఇస్తూ వుంటుంది. తోటమాలి రాజకుమార్తెకు పూలు, పండ్లు తెచ్చిస్తుంటాడు. తోటమాలికి రాజకుమార్తె అంటే ఎంతో గౌరవం. రాజకుమార్తెకు తోటమాలి అంటే....

"రాజకుమార్తెకు తోటమాలి అంటే....మధ్యలో ఆపావేమిరా? పూర్తిగా చెప్పు." శారద కుతూహలంగా అడిగింది.

"మీరు నా ముందు ఉప్మా పెట్టింది తినడానికా లేక దానిని చూచుకుంటూ కథ చెప్పమనా...."

"సరే. సరే ముందు ఉప్మా తిను."

యాదగిరి ఏదో ఆలోచిస్తూ నెమ్మదిగా ఉప్మా తినసాగాడు. "నువ్వు మరీ అంత నెమ్మదిగా తింటే నీ ముందున్న ఉప్మా పూర్తిగా తినడానికి నాలుగు రోజులు పడుతుంది."


"చూడండి. నాలుగు నిమిషాలు పూర్తిగా కాకముందే దానిని పొట్టలో మాయం చేశాడు యాదగిరి. శారద మరింత ఉప్మా వడ్డించబోయింది.

"వద్దం.",

"అదేమిట్రా, అప్పుడే కడుపు నిండిందా?"

"మీ ఉప్మాలను, పెసరట్లను....కడుపు నిండా తింటే ఇంటికి వెళ్ళి ఏమీ తినలేదు. ఇంట్లో ఏమీ తినకుండా ఉంటే నాయనమ్మ బాధ పడుతుంది. నాయనమ్మను బాధ పెట్టడం నా కిష్టం లేదు." అంటూ విస్తరి తీసుకపెళ్ళి పెంటపై పడేసి చేయి కడుక్కొని వచ్చాడు.

"మీ నాయనమ్మ చేసే వంటలు ఎలా వుంటాయిరా?"




"మీరు చేసే వంటలు ఫస్టుక్లాసులో ఉంటాయి. మా నాయనమ్మ చేసే వంటకాలు థర్డుక్లాసులో ఉంటాయి. మేము థర్డుక్లాసు వాళ్ళమే కదండీ! అయినా మా నాయనమ్మ ప్రేమతో వడ్డించే ఏ ఆహారమైనా దాని రుచితో నిమిత్తం లేకుండా గబగబా తినేసి తృప్తి పడుతాను."

"అది సరేగానీ ... నువ్వు రాజకుమార్తే, తోటమాలి కథను పూర్తిగా చెప్పనే లేదు...."

అంతలో గేదె అరుపు వినిపించింది.

"మరెప్పుడైనా చెప్తాను." అని చెప్పి పాలు పిండడానికి చెంబు పట్టుకొని అక్కడి నుండి వెళ్ళిపోయాడు యాదగిరి.

* * *

శారద పద్ది తీసుకొని వచ్చింది. ఆ సమయానికి యాదగిరి బెండచెట్ల మధ్యవున్న గడ్డి పీకేస్తున్నాడు.

"నాన్న కన్పించడం లేదేమిట్రా?" శారద యాదగిరి దగ్గరకు వచ్చి అంది.

"దొరగారు సిరిసిల్లకు వెళ్ళారండీ!"

"ఎప్పుడు?"

"ఉదయమే."

"ఎందుకు?"

"కరెంటుమోటారు తీసుక వెళ్ళారు."

"దానికేమైంది?"

"కాలిపోయింది."

"ఎలా?"

"బిల్లో ఏదో లోపల సొచ్చినట్టుంది అమ్మాయి గారూ!"

"అది సరేగానీ, నాన్న ఎప్పుడు వస్తానన్నారు?"

"చెప్పలేదండీ!"

శారద మామిడిచెట్టు క్రిందికి వెళ్ళిపోయింది. కాసేపు కూర్చుంది. కాసేపు అటూ ఇటూ తిరిగింది. (సశేషం)